క్లుప్తంగా

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో నూతన తహసీల్దార్ రమాదేవి

మంత్రాలయం రూరల్ : ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. నూతనంగా మంత్రాలయం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రమాదేవి ఎమ్మెల్యేను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రీ సర్వేలో చాలా మంది రైతులు సమస్యలు తమ దృష్టి తెస్తున్నారని చెప్పారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సకాలంలో రైతులకు పాస్ పుస్తకాలు అందజేయాలన్నారు. అలాగే ఆధార్ కార్డు, రేషన్ కార్డుల్లో మార్పు చేర్పులపై మార్గ నిర్దేశం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడ స్వామికి పూజలు చేపట్టారు.

తల్లికివందనం వర్తింపజేయాలి



సీడీపీఓకు వినతి పత్రం ఇస్తున్న అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ సిబ్బందికి తల్లికివందనం పథకంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్ నాయకులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి, శైలజ, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సఫరున్నీసా బేగంకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయిందన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు



కొత్తగా వేస్తున్న తాగునీటి పైపులైన్

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని పింజారి గేరిలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి ప్రకాశంలు తెలిపారు. 12వ వార్డులోని పింజారిగేరిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని పైపులైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలోని అన్ని వీధులకు తాగునీరు అందిస్తామన్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు.

వాల్మీకి విగ్రహ స్థల వివాదం పరిష్కారం



స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మధుసూదన్‌రావు

నందవరం : మండల కేంద్రంలోని నందవరంలో గ్రామంలోని బీసీ కాలనీలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేసే స్థల వివాదం నెలకొంది. గ్రామంలో మసీద్ పక్కన్న వాల్మీకి విగ్రహం కోసం వాల్మీకులు పునాదులు తావ్వారని ఫిర్యాదు రావడంతో సీఐ మధుసూదన్‌రావు శనివారం విచారణ చేపట్టారు. అనంతరం బీసీ కాలనీలో తవ్విన పునాదులను సీఐ పరిశీలించారు. ముస్లిం పెద్దలు, వాల్మీకి పెద్దలతో సీఐ మాట్లాడి స్థల వివాదానికి పరిష్కారం చూపారు. మసీద్ పక్కన కాకుండ కొద్దిగా దూరంలో పునాదులు తవ్వుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం కావడంతో ఇరు వర్గాలు సంతోషం వ్యక్తం చేశారు.

అనారోగ్యం 'క్యారీ'!

- అమలుకాని సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల క్రయ, విక్రయాలు
- క్యారీ బ్యాగ్‌లు తిని మూగజీవాలు మృత్యువాత
- మానవాళికి ఆరోగ్యానికి ముప్పు
- ఉన్నతాధికారులు ఆదేశిస్తే తూతూ మంత్రంగా తనిఖీలు





డంప్ యార్డులో కనిపిస్తున్న ప్లాస్టిక్ కవర్లు

ఆదోని అర్బన్: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు అని తెలిసినా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నా విచ్చలవిడిగా క్రయ, విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూజ్డ్ వాడకాన్ని నిషేధించింది. దీంతో అధికారులు తొలుత ఉక్కుపాదం మోపినా తర్వాత షరా మామూలే అయ్యింది. వ్యాపార సముదాయాలు, కూరగాయల మార్కెట్, కిరణాషాపులు, బేకరీలు, ఫ్యాన్సీ దుకాణాలు, టీ స్టాల్, హోటళ్లు, రెస్టారెంట్లో వీటి వినియోగం పెరిగిపోతోంది. దీంతో ప్రధాన పంట కాలువలు, ఖాళీ స్థలాలు, డంపింగ్ యార్డులు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

వ్యర్థాల్లో 75 శాతం ప్లాస్టిక్ కవర్లే

చిన్న దుకాణాల నుంచి కార్పొరేట్ దుకాణాల వరకు నిత్యం టన్ను కొద్దీ ప్లాస్టిక్ వినియోగం జరుగుతుంది. ఆదోని పట్టణంలో రోజుకు 62 టన్నులు తడి, పొడి చెత్తను మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది సేకరిస్తున్నారు. ఇందులో 75 శాతం ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు 250 కేజీలు ప్లాస్టిక్ కవర్లు,సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. అందులో 16 కేసులు నమోదు చేయగా, రూ.16 వేలు జరిమానా విధించారు.

తూతూ మంత్రంగా తనిఖీలు

కేంద్ర ప్రభుత్వం 2022 జూలై నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. అయినా పట్టణంలో టీ స్టాల్ నుంచి బడా దుకాణాల వరకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. విచ్చలవిడిగా షాపుల్లో పెట్టి చిన్నచిన్న వస్తువులను, తిను బండారాలను, నిత్యావసర సరుకులను నిర్భయంగా ప్రజలకు కవర్‌లో ఇస్తున్నా వాటిని చూసీ చూడకుండా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే అడపాదడపా దాడులు చేసి కేసులు రాయడం మినహా క్షేత్రస్థాయిలో దాడులు చేయడంలేదని ఆరోపణలు ఉన్నాయి.

ప్లాస్టిక్‌తో అనారోగ్యం

తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ భూమిలో కరగాలంటే వందల ఏళ్లు సమయం పడుతుంది. వెయ్యేళ్లు అయినా ప్లాస్టిక్ అవశేషాలు భూమిలో కరగదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో భూవాతావరణంలో మార్పులు సంభవించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్‌లలో వేడి వస్తువులు ప్యాక్ చేయడం, ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగడం ద్వారా కొద్దిపాటి ప్లాస్టిక్ అవశేషాలు కరిగి మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. వీటిలో ఉండే లాస్టీసైజర్‌లు, తక్కువ మాలిక్యూలర్ సమ్మేళనాలు, రంగుల కోసం వాడే విషపూరిత రసాయనాలు, ఆహార పదార్థాల ద్వారా మనలో చేరి కేన్సర్ కారకంగా మారే అవకాశం ఉంది.

ప్లాస్టిక్ సంచుల తయారీలో కాగ్నియం, జింక్ వంటి విషపూరిత లోహాలు ఉపయోగించినప్పుడు అవి వేడిగా ఉండే ఆహార పదార్థాలను విషపూరితగా మార్చేస్తాయని, దీంతో తమకు తెలియకుండానే దీర్ఘకాలిక రోగాలకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్‌లోని డయాక్సిన్‌ల వల్ల మహిళల్లో రొమ్ము, కేన్సర్ ప్రమాదం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో వందల సంఖ్యలో పశువుల మరణాలకు ప్లాస్టిక్ సంచులే కారణమని చెబుతున్నారు. ఆహార వ్యర్థాలు క్యారీ బ్యాగుల్లో ఉంచి బహిరంగ ప్రదేశాల్లో పారేయడం వల్ల పశువులు దానిని తిని జీర్ణకోశ వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయి.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం

ప్లాస్టిక్ నిషేధాజ్ఞలు అమలులోకి రావడంతో చాలామంది నిరుద్యోగులు ప్రత్యామ్నాయంగా పేపర్ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. వీటితోపాటు కంపోస్టబుల్ కవర్లు, బ్యాగులు, ప్లేట్లు వచ్చాయి. పట్టణంలోని విక్టోరియా పేటలో, ఆదోని ఏరియా ఆసుపత్రి సమీపంలోని పలు దుకాణాల్లో విక్రయాలు జరుగుతున్నాయి. అయితే చాపకింద నీరులా ప్లాస్టిక్ కవర్లు పెరిగిపోవడంతో వీటిపై ప్రభావం చూపుతోంది.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించి, చైతన్యం తీసుకురావాలి. దాడులు చేస్తే సరిపోదు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ కవర్‌లను నిషేధించాలి. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయానికి కంపోస్టబుల్ కవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి వంద నుంచి 150 రోజుల్లోనే ఇవి మట్టిలో కరిగిపోతాయి. మనుషులు, జీవరాశులకు ఆరోగ్యం ఎంతో మేలు చేస్తుంది.

– లలిత, న్యాయవాది

అవగాహన కల్పిస్తున్నాం



ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజల్లో చైతన్యం పెంచేందుకు అవగాహన, ర్యాలీలు, కరపత్రాలను పంచి పెట్టాం. అంతేగాకుండా సరుకుల కోసం వెళ్లేటప్పుడు ఇంటి నుంచి సొంత బ్యాగులు, గుడ్డ, నార సంచులు తీసుకెళ్లాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలి. అలా ఉంటేనే భావితరాల వారికి స్వచ్ఛమైన పర్యావరణం అందించిన వారమవుతాం.

– ఎం.కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

రూ.25 వేల వరకు జరిమానా

ప్లాస్టిక్ సంచులు, కవర్లు, కప్‌లు, గ్లాసులపై విధించిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై రూ.25 వేల వరకు జరిమానా విధించే చట్టం అమలులో ఉంది. హోటల్స్, రిటైల్ షాపుల యజమానులు, అమ్మకదారులకు ప్లాస్టిక్ సంచులు, టీ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు వినియోగించే వారిపై రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించవచ్చు. అధికారులకు సీజ్ కూడా చేసే అవకాశం ఉంది.

సబ్ జైలు తనిఖీ



ఖైదీల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: పట్టణంలోని సబ్‌జైలును శనివారం జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె. సుధ సందర్శించారు. ఖైదీల వివరాలను, వారికి అందుతున్న సేవలపై జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. క్షణికావేశంలో జైలుకు వచ్చి ఉంటారని, ఇకనైనా మంచి నడవడికను నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయ సేవాధికార సంస్థ వారిని సంప్రదించాలని సూచించారు. జడ్జి వెంట న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, జైలు అధికారులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్

ఆదోని రూరల్: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కౌతాళం మండలంలోని కాత్రికి, పొదలకుంట గ్రామాల మధ్య శనివారం వాహనాల తనిఖీ చేస్తుండగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె. సైదుల్ తెలిపారు. పొదలకుంట గ్రామానికి చెందిన లక్కీ శివ వద్ద నుంచి 12 కర్ణాటక మద్యం బాక్సులు (1152 టెట్రా ప్యాకెట్లు)ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.60 వేలు ఉంటుందని, అలాగే ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్మినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఆస్పరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య తెలిపారు. శనివారం మండలంలోని కైరుప్పల గ్రామంలో సీపీఐ గ్రామ శాఖ మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామచంద్రయ్య సీపీఐ జెండాను ఆవిష్కరించారు. రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏగ్రామంలో చూసినా మంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు కారన్న, నాగేంద్రయ్య, విరుపాక్షి, కృష్ణమూర్తి, రమేష్, బడేసాహెబ్, రంగన్న పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్లకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)పై పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎస్‌జీటీలకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎంటీఎస్ టీచర్ల జాబితాలను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టామని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులోని కోట వద్ద ఉన్న బహిరంగ ప్రదేశంలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించగా.. 12 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 21,250 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. అరెస్టు అయిన వారిలో లింగన్న, నాగరాజు,సుంకన్న,జిలాన్,జయరాముడు తదితరులు ఉన్నారని పేర్కొన్నారు.

24న ప్రవేశ పరీక్ష

మద్దికెర : స్థానిక ఆదర్శ పాఠశాలలో 6,7,8,9వ తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సవిత శనివారం తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకోవాలని సూచించారు.



పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగు నీరు

బడి ముంగిట మురుగు

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మరుగుదొడ్ల పైపులైన్ లీక్ కావడంతో మురుగు నీరు అంతా స్కూల్ ఆవరణలోకి వచ్చి చేరుతోంది. దీంతో ఆడుకోవడానికి వస్తే దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు వల్ల రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు తొలగించి, లీకైనా పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక

కోసిగి: సీపీఐ జిల్లా కార్యదర్శి భాస్కర్‌యాదవ్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన శనివారం కోసిగి గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా చాంద్‌బాషా, సహాయ కార్యదర్శిగా రఘుతో పాటు మరో 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకుడు ఓంకార్‌స్వామి, రైతు సంఘం మండల నాయకులు తాయన్న, విరూపాక్షి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు దళిత ద్రోహులు

ఆదోని రూరల్: కూటమి ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ దళిత ద్రోహులని వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రచార అధ్యక్షుడు పరిగల నారాయణ, ఎస్సీ సెల్ ఆదోని మండలాధ్యక్షులు నాగప్ప అన్నారు. శనివారం వారు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ధణాపురం సర్పంచ్ చంద్రశేఖర్‌కు నేరుగా ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలి గుడిసె క్రిష్ణమ్మ వెళ్లి క్షమాపణలు చెప్పాలే గానీ, ప్రెస్‌మీట్ పెట్టి చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. కావాలనే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తాయని గుడిసె క్రిష్ణమ్మ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితుల పట్ల కూటమి ఎమ్మెల్యేకు, టీడీపీ నాయకురాలు చిన్న చూపు ఉండడం తగదన్నారు. ఇకనైనా దళితుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు నారాయణ, యేసేబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీప కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కూర్మనారాయణస్వామి, హనుమన్న స్వామి వార్లకు గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి



శిలా మండప నిర్మాణం

- కౌతాళంలో ముమ్మరంగా ఆలయం అభివృద్ధి పనులు
- ఉత్తర ద్వారంలో స్వామి ఉండటం ప్రత్యేకత
- రూ. కోటితో శిలా మండపంతో పాటు మహాద్వార నిర్మాణం
- దాతలు సహకరించాలని కోరుతున్న కమిటీ సభ్యులు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

కౌతాళం: కలియుగ దైవంగా భావించే వేంకటేశ్వరస్వామిని భక్తిభావంతో కొలుస్తారు. చాల కుటుంబాలకు ఆయనే ఇంటి దేవుడు. మండల కేంద్రమైన కౌతాళంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కమిటీ సభ్యులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు కోటి రూపాయలు భక్తుల విరాళాలతో గర్భాలయం చుట్టూ శిలా మండపంతో పాటు మహా ద్వారం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు జోరందుకున్నాయి. ఈ పనుల కోసం భక్తులు ముందుకు వచ్చి విరాళాలను ఇస్తున్నారు. వచ్చే జనవరి 2026లోపు దీనిని పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం ఉత్తర ద్వారంలో ఉండడం ఎంతో విశిష్టం. దేవాలయం నిర్మాణం కోసం ఎవరైన నేరుగా బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలను కోనే వారు కోరుతున్నారు. దాతలు కౌతాళం కెనారా బ్యాంకు అకౌంట్ 120026171350 నంబర్ శ్రీనివాస సేవ ట్రస్టు పేరిటా కూడా విరాళాలు జమ చేయవచ్చు అని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులకు అందరి సహకారం ఎంతో అవసరమన్నారు.



ఆదోని మున్సిపల్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో యోగా చేస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్



ఎమ్మిగనూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాల్లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం పదిలం



ఆదోనిలో యోగాసనాలు వేస్తున్న జడ్జీలు, న్యాయవాదులు



మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యోగా చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, అధికారులు



ఆదోనిలో యోగాసనం వేసిన విద్యార్థిని

సాక్షి నెట్‌వర్క్: యోగా చేయడం వలన ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోనవచ్చని, రోజువారి జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. శనివారం ఆదోని పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, అసిస్టెంట్ ఎంవీఐ అవేష్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో యోగా కార్యక్రమాలను చేపట్టారు. ఆదోని పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాల్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ న్యాయవాదులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీవల్లి, అర్చన, ఎం.ఎల్.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి,స్పెషల్ ఆఫీసర్ రమణారెడ్డి,మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.
- మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ యోగా కార్యక్రమం చేపట్టారు. యోగా శిక్షకులు శ్రీకృష్ణ పరబ్రహ్మ, పీఈటీ రవీంద్ర, కళ్యాణి నేతృత్వంలో అధికారులు, విద్యార్థులు ఆసనాలు వేశారు.
- పెద్దకడబూరు మండలంలో ప్రత్యేకాధికారి నాగరాజురావు, ఎంపీడీఓ ప్రభావతి, ఎంఈఓలు సువర్ణల సునీయం, రామమూర్తి ఆధ్వర్యంలో, కోసిగిలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కౌతాళంలో తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, సీఐ అశోక్‌కుమార్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి.
- ఎమ్మిగనూరు పరిధిలోని కోటేకల్ కొండల సమీపంలోని హరిత నగరవనంలో ఫారెస్ట్ రేంజ్ అధికారిణి తేజస్విని, జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. నందవరంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య, ఎంఈఓ రఘునాథ్ ఆధ్వర్యంలో, గోనెగండ్లలో జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఎంపీడీఓ మణి మంజరి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది.